## క్లుప్తంగా

### ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వ్యాపారులు, వాహనదారులతో మాట్లాడుతున్న ఏసీపీ

తాండూర్: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ అన్నారు. మండలంలోని తాండూర్ ఐబీ, తాండూర్ బస్టాండ్ ఏరియా మెయిన్ రోడ్‌లో దుకాణాల యజమానులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డుపై వ్యాపారాలు నిర్వహించొద్దన్నారు. తమ షాపులకు వచ్చే వినియోగదారుల వాహనాలను రోడ్లపైన నిలిపి ఉంచకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దుకాణదారులు తప్పనిసరిగా సీసీ కెమెరాలు అమర్చుకోవాలని సూచించారు. రోడ్డు భద్రత నియమాలు పాటించకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఏసీపీ వెంట తాండూర్ సీఐ కుమారస్వామి, సిబ్బంది ఉన్నారు.

### ఊర చెరువు కాపాడాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న మత్స్యకారులు

జన్నారం: మండలంలోని కిష్టాపూర్ శివారులోని ఊరచెరువును అక్రమ పట్టాదారుల నుంచి కాపాడాలని గ్రామానికి చెందిన మత్స్యకారులు కోరారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చర్లపల్లికి చెందిన 80 మత్స్యకారుల కుటుంబాలు 46 ఏళ్లుగా కిష్టాపూర్ ఊర చెరువులో చేపలు పడుతూ జీవనం సాగిస్తున్నాయని తెలిపారు. కొన్నేళ్ల క్రితం చెరువును ఐదుగురు తమ పేర్లతో అక్రమపట్టాలు చేయించుకుని వ్యవసాయ భూమిగా మార్చుకోవాలని యత్నిస్తున్నారని ఆరోపించారు. అధికారులు అక్రమ పట్టాలు రద్దు చేయాలని కోరారు. మత్స్యకారులు నర్సయ్య, సత్తయ్య, శ్రీనివాస్, భీమయ్య, తిరుపతి, శంకరయ్య, భీమారాజు ఉన్నారు.

### ఎస్సీ గురుకులాల్లో దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలఅర్బన్: టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐ ఎస్సీ గురుకుల సొసైటీ పరిధిలో నాన్ సీఈవో విద్యాలయాల్లో 2024–25 విద్యా సంవత్సరానికి జూనియర్ ఇంటర్‌లో మిగిలిపోయిన సీట్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు రీజినల్ కోఆర్డినేటర్ స్వరూపరాణి తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈనెల 24 నుంచి 31 వరకు గురుకుల సొసైటీ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, వొకేషనల్ కోర్సుల్లో సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు.

### స్కాలర్‌షిప్‌కు ఎంపిక



అక్షిత్

లక్సెట్టిపేట: మండలంలోని జెండావెంకటాపూర్ ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థి భైరి అక్షిత్ (ఎన్ఎంఎంఎస్) నేషనల్ మెయిన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు హెచ్ఎం యశోధర తెలిపారు. పాఠశాల నుంచి 17 మంది విద్యార్థులు పరీక్ష రాయగా అక్షిత్ ఎంపికైనట్లు పేర్కొన్నారు. విద్యార్థిని పాఠశాల సిబ్బంది, కుటుంబ సభ్యులు అభినందించారు.

### మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

మందమర్రిరూరల్: మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ సౌజన్య సూచించారు. మందమర్రి ఐకేపీ కార్యాలయంలో శుక్రవారం మండల సమైక్య సమావేశం నిర్వహించారు. ఐకేపీ ఏపీఎం లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.

### చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

జన్నారం: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్సై రాజవర్ధన్ అన్నారు. మండలంలోని కవ్వాల్‌లో అంజత్‌ఖాన్ స్మారకార్థం నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు శుక్రవారం ఆయన బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి కవ్వాల్ జట్టుకు రూ. 10 వేలతోపాటు షీల్డ్, ద్వితీయ బహుమతి సాధించిన కిష్టాపూర్ జట్టుకు రూ.5 వేల నగదు, షీల్డ్‌ను అందజేశారు. కోఆప్షన్ సభ్యుడు మున్వర్ అలీఖాన్, నాయకులు రాజశేఖర్, సయ్యద్ ఇసాక్, సక్రు నాయక్, కాలిరాం, శాఖీర్ అలీ, మహేశ్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

# మామిడి రైతుకు కష్టం

- ఈదురుగాలులతో ఏటా నష్టం
- పరిహారానికి ఎదురుచూపు
- ఎనిమిదేళ్లుగా ఆదుకోని ప్రభుత్వం

నెన్నెల: జిల్లాలోనే మామిడి తోటలకు పెట్టింది పేరు. నెన్నెల, భీమారం, జైపూర్, మందమర్రి, చెన్నూర్ మండలాల్లో వేలాది హెక్టార్లలో మామిడి తోటలు సాగు చేశారు. ఏటా ముందుగా వస్తున్న పూతను చూసి సంబరపడుతున్న రైతు తర్వాత ఈదురుగాలులు వడగళ్ల వర్షాలకు పూత, కాయలు రాలి ఏటా తీవ్రంగా నష్టపోతున్నారు. సుమారు ఎనిమిదేళ్లుగా ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్నారు. అయినా పరిహారం అందడం లేదు. బీమా చేయించిన పరిహారం ఇచ్చే దిక్కు లేదు. దీంతో వేలాది ఎకరాల్లో మామిడి తోటలు దెబ్బతిన్న రైతులు రూ.కోట్లలో నష్టపోతున్నారు. ఐదేళ్లుగా ప్రభుత్వం నుంచి పైసా నష్టపరిహారం అందలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏటా ఈదురుగాలులు, వడగళ్ల వర్షాలకు మామిడికాయలు రాలిపోవడం, చెట్లు విరిగిపోవడంతో అప్పట్లో రెవెన్యూ, ఉద్యానవన అధికారులు నష్టం వివరాలు నమోదు చేసుకొని వెళ్లారు. ఏటా సర్వేలు చేయడమే తప్పా ఇప్పటివరకు పరిహారం మాత్రం అందలేదు.

**విస్తారంగా మామిడి సాగు..**

ఉద్యానవన శాఖ అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో సుమారు 16 వేల హెక్టార్లకు పైగా మామిడి తోటలు ఉన్నాయి. వాతావరణంలో మార్పులకు కారణంగా ఏటా మామిడి రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. డిసెంబర్, జనవరిలో పూత వస్తుండటంతో సంతోషపడుతున్నారు. తర్వాత కాయలు పట్టిన సమయంలో ఏప్రిల్, మే నెలల మధ్య ఈదురుగాలులు, వడగళ్ల వానలు వస్తుండటంతో సగానికిపైగా కాయలు రాలిపోతున్నాయి. ఈసారి కాయ సైజ్ మంచిగానే రావడంతో లాభాలు వస్తాయని మామిడి రైతులు ఆనందపడ్డారు.



ఆవుడంలో అకాల వర్షానికి రాలిన కాయలను ఏరుతున్న రైతు

**రూ.కోట్లల్లో నష్టం..**

జిల్లాలో వేలాది హెక్టార్లలో ఏటా కాయలు రాలిపోతుండటంతో నష్టం రూ.కోట్లలో ఉంటుంది. ఏటా వేల ఎకరాల్లో మామిడి తోటలు దెబ్బతిని కోట్లకుపైగా నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేస్తూనే ఉన్నారు. కాని ఇంతవరకు ఒక్కపైసా కూడా రైతుకు అందలేదు. ప్రభుత్వం స్పందించి ఇతర పంటలు పోయిన మామిడి పంటలతో గట్టెక్కాలని కోరుకుంటున్న రైతులకు ఏటా నష్టం జరుగుతుంది. ప్రభుత్వం స్పందించి పరిహారం అందించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

**పరిహారం అందడం లేదు**



ఏటా గాలిదుమారం, వడగళ్ల వానలు, ఎండలకు ఏదో ఒక రకంగా మామిడి పంటకు నష్టం వాటిల్లుతుంది. అధికారులు సర్వే చేసి అంచనా వేస్తున్నారే తప్పా పైసా పరిహారం అందడం లేదు. ప్రతిసారి మామిడి రైతు ఏదో ఒక రకంగా నష్టపోతూనే ఉన్నాడు. ప్రభుత్వం స్పందించి పరిహారం అందించాలి. – జనార్దన్, మామిడి రైతు, ఆవుడం

**ప్రభుత్వం ఆదుకోవాలి**



గాలిదుమారం వడగళ్ల వానతో ఏట మామిడి కాయలు నేలరాలి నష్టపోతున్నాం. కాతనే అంతంత మాత్రంగా కాస్తే అకాల వర్షం ఉన్న కాయలను ఊడ్చుకెళ్లింది. ఉద్యావన అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టంపై అంచనా వేసి పరిహారం అందేలా చూడాలి. నష్టపోయిన మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.– అరుణ్‌సింగ్, మామిడి రైతు, నెన్నెల

**నివేదించాం**



ఏటా అకాల వర్షాలు, ఈదురు గాలులకు మామిడి రైతులు నష్టపోతున్నది వాస్తవమే. దీనిపై క్షేత్రస్థాయిలో తిరిగి నష్టం అంచనా వేసి ప్రభుత్వానికి పరిహారం కోసం నివేదించాం. జిల్లాలో 112 మంది రైతులకు చెందిన 250 ఎకరాల్లో నష్టం జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే రైతుల ఖాతాల్లో జమ చేస్తాం.

– ఉదయ్‌కుమార్, జిల్లా ఉద్యానవన అధికారి

## యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సాయిచరణ్

బెల్లంపల్లి: పట్టణంలోని 2వ వార్డుకు చెందిన దెబ్బెటి సాయిచరణ్ యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు శివసేనరెడ్డి ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు సంపత్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ శుక్రవారం సాయిచరణ్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ యువజన విభాగాన్ని బలోపేతం చేయడానికి కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు మునిమంద రమేశ్, కంకటి శ్రీనివాస్, దావ రమేశ్, దెబ్బెటి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



నియామకపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే

## గడువులోగా యూనిఫాంలు అందించాలి

లక్సెట్టిపేట: పాఠశాలలు ప్రారంభమయ్యేలోపు విద్యార్థులకు గడువులోగా యూనిఫాంలు అందించాలని ఎంపీడీవో సరోజ అన్నారు. మండలంలోని జెండావెంకటాపూర్, బలరావుపేట ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో కుట్టు కేంద్రాలను శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. యూనిఫాంలను నాణ్యతగా కుట్టాలన్నారు. పాఠశాలలో నిర్వహిస్తున్న మరమ్మతు పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలన్నారు. కుట్టు కేంద్రాల నిర్వాహకులు సిబ్బంది అధికారులు ఉన్నారు.



యూనిఫాంను పరిశీలిస్తున్న ఎంపీడీవో

## మల్బరీ సాగు లాభదాయకం

చెన్నూర్‌రూరల్: పట్టు పరిశ్రమలో మల్బరీ సాగు రైతులకు ఎంతో లాభదాయకమని సెరికల్చర్ ఏడీఏ రాథోడ్ పార్వతి అన్నారు. మండలంలోని లంబడిపల్లి గ్రామంలో మల్బరీ తోటలను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో మల్బరీ సాగు రైతులకు ప్రభుత్వం రాయితీలు ఇచ్చి ప్రోత్సహిస్తుందన్నారు. జిల్లాలో కొన్ని మండలాల్లో మాత్రమే ఈ సాగుకు అనుకూలంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుంటే ఉపాధి పొందడమే కాకుండా పట్టు పురుగుల పెంపకంలో మంచి లాభాలు ఆర్జించవచ్చన్నారు. పట్టు పరిశ్రమకు ఎంతో డిమాండ్ ఉందని, దీని కోసం కేంద్ర ప్రభుత్వం సిల్క్ సమగ్ర 2 పథకాన్ని గతేడాది అమలు చేసిందన్నారు. షెడ్డు నిర్మాణానికి రూ.2.25 లక్షలు, ఎస్సీ, ఎస్టీలకు రూ.2.92లక్షల రాయితీ ఇస్తోందన్నారు. రెండెకరాల్లో మల్బరీ తోట సాగుకు రూ.60 వేలు, ఎస్సీ ఎస్టీలకు రూ.78 వేలు రాయితీ అందజేస్తుందని పేర్కొన్నారు.



మల్బరీ సాగును పరిశీలిస్తున్న సెరికల్చర్ ఏడీఏ పార్వతి

### నేడు పంటల సాగుపై అవగాహన

భీమిని: మండలంలోని రైతువేదికలో పంటల సాగుపై రైతులకు శనివారం అవగాహన కల్పించనున్నట్లు ఏవో విజయ్‌కుమార్ తెలిపారు. వర్షాకాలంలో పంటల సాగు మెలకువలను వివరించనున్నట్లు పేర్కొన్నారు. మండల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## శిక్షణ ప్రతినిధులకు సన్మానం



సన్మానిస్తున్న ఎంపీడీవో శశికళ

జన్నారం: కేంద్రప్రభుత్వం స్టాఫ్ సెలక్షన్ ద్వారా నియామకమైన అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లకు శిక్షణలో భాగంగా మండలంలో తిమ్మాపూర్‌లో ఐదు రోజుల అధ్యయన కార్యక్రమం ముగిసింది. రాష్ట్రాలకు చెందిన సురేందర్ స్వరూప్, బిగ్నరాజ్ మిస్రా, నిఖిల్‌జూన్, విశాల్ దకాడ్, శివమ్‌లకు ప్రభుత్వాల పథకాలు, వ్యవసాయం, మౌలిక వసతుల కల్పన, ఆర్థిక, సామాజిక విషయాలపై అధ్యయనం పూర్తయింది. వీరిని ఎంపీడీవో శశికళ, గ్రామస్తులు శుక్రవారం సన్మానించారు. ఈజీఎస్ ఏపీవో రవీందర్, మాజీ సర్పంచ్ జాడి గంగాధర్, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

## గంగాజలంతో ఆదివాసీలు కాలినడకన

కాసిపేట: మండలంలోని తాటిగూడలో రెండు రోజులుగా ఆదివాసీలు భీమన్న దేవుడి జాతర కొనసాగుతోంది. మండుటెండలో ఆదివాసీలు కాలినడకన సల్పలవాగుకు వెళ్లి గంగాజలంతో శుక్రవారం బయల్దేరి వచ్చారు. ఆలయంలోని విగ్రహాలను గంగాజలంతో శుద్ధిచేశారు. శనివారం తెల్లవారుజాము ప్రత్యేక పూజలతో జాతర ముగియనుంది. గ్రామపటేల్ మడావి శేఖర్, పూజారి మడావి వెంకటేశ్, మడావి రాజు, మడావి గోపాల్, అర్జు, సిడాం కమలాకర్, సిడాం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



గంగాజలంతో ఆదివాసీలు

### ఇంటిపై విరిగిపడ్డ చెట్టు

దండేపల్లి: మండలంలోని చింతపల్లిలో శుక్రవారం సాయంత్రం గాలివానకు లింగాల నాగయ్య ఇంటిపై చెట్టు విరిగిపడి ఇల్లు కూలింది. ఆ సమయంలో ఇంట్లో నాగయ్య తో పాటు ఆయన భార్య ఉన్నారు. స్వల్పగాయాలతో బయటపడ్డారు.



### పైపులైన్ లీకేజీ

**మంచిర్యాలటౌన్: పట్టణంలోని బెల్లంపల్లి చౌరస్తా నుంచి లక్ష్మీ థియేటర్ చౌరస్తాకు వెళ్లేదారిలో శుక్రవారం తాగునీటి పైపులైన్ లీకేజీ అయింది. దీంతో రోడ్డుపై నీరు చేరడం, ఒక్కసారిగా కురిసిన భారీ వర్షానికి ఆ ప్రాంతం నీటితో నిండింది. దీంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.**



### ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

బెల్లంపల్లి: ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. బెల్లంపల్లిలోని ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇంటర్ ఫస్టియర్ పరీక్షకు 65 మంది విద్యార్థులు హాజరుకావల్సి ఉండగా 7గురు విద్యార్థులు హాజరుకాగా, 58 మంది గైర్హాజరయ్యారు. సెకండియర్ పరీక్షకు 14 మందికి గాను 13 మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాయగా ఒకరు గైర్హాజరయ్యారు.

# మండుటెండల్లో ‘ఉపాధి’..!

- పని స్థలాల్లో సౌకర్యాలు కరువు
- వేతనాలు చెల్లింపుల్లో జాప్యం
- ఇబ్బందుల్లో ఉపాధి కూలీలు

బెల్లంపల్లిరూరల్: ‘ఉపాధి’కూలీలను సమస్యలు వెంటాడుతున్నాయి. అధికారులు, సిబ్బంది పని స్థలాల వద్ద ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదు. మండుటెండల్లో ఉపాధి పనులు చేస్తున్నారు. భానుడు భగభగమంటున్నా టెంట్లు ఏర్పాటు చేయడం లేదు. నీటి వసతి, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో లేక అవస్థలు పడుతున్నారు. ఎండవేడిమి తాళలేక సుదూర ప్రాంతాలకు వెళ్లి పనులు చేయడం వారికి ఇబ్బందిగా మారింది. అటవీ ప్రాంతాల్లో చేసే పనులకు తీవ్ర వ్యయ ప్రయాసాల కోర్చి వెళ్లాల్సిన పరిస్థితులు ఉన్నాయి. దూరప్రాంతాల్లో ఉపాధి పనికి వెళ్లేవారికి అదనపు ఖర్చులు భారంగా మారాయి.

**బెల్లంపల్లి మండలంలో..**

బెల్లంపల్లి మండలంలో 17 పంచాయతీలు ఉండగా, మొత్తం 6,877 జాబ్ కార్డులు ఉన్నాయి. ప్రస్తుతం ఈ ఆర్థిక సంవత్సరంలో 3,887 మంది కూలీలు ఉపాధి పనుల్లో పాలుపంచుకుంటున్నారు. గతేడాదితో పోలిస్తే ఈసారి ఉపాధి పనులు వినియోగించుకునే వారి సంఖ్య పెరిగింది. అదేస్థాయిలో సమస్యలు సైతం వేధిస్తున్నాయి.



మండుటెండలో అటవీ ప్రాంతంలో పని చేస్తున్న కూలీలు

**వేతనాల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం**

ఉపాధి కూలీలకు వేతనాల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. పని చేసిన తర్వాత వేతనాలు అకౌంట్లో పడేందుకు 20 రోజుల నుంచి మూడు నెలల వ్యవధి పడుతోందని వారు వాపోతున్నారు. పనికి అనుగుణంగా వేతనాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులు పని చేస్తే రూ.300 రావడం లేదంటున్నారు. అడిగితే సాంకేతిక సమస్యలు అంటున్నారని, పని కొలతలు తేడాలు ఉన్నాయని పేర్కొంటున్నారు.

**వేతనాలు వస్తలేవు**



ఉపాధి పనికి సంబంధించి వేతనాలు సరిగా అందడం లేదు. పని చేసిన తర్వాత నెల పైనే పడుతోంది. అది కూడా చేసిన అరకొరగా వస్తున్నాయి. అధికారులు కూలీలకు సకాలంలో వేతనాలు అందేలా చూడాలి.

– కొమ్ము సురేఖ, ఉపాధి కూలీ, చంద్రవెల్లి

**సమస్యలు లేకుండా చూస్తాం**

ఉపాధి కూలీలకు సమస్యలు లేకుండా చూస్తాం. వేతనాల చెల్లింపుల్లో ఎన్ఎంఎంఎస్ సాంకేతిక లోపంతో జాప్యం జరుగుతోంది. ఇకపై వేతనాల చెల్లింపుల్లో జాప్యం జరగకుండా చర్యలు తీసుకుంటాం. తాగునీరు, ఇతర వసతులు కల్పిస్తాం. సమస్యల పరిష్కారం కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాను.

– ఎస్తర్ డేవిడ్, ఈజీఎస్ ఏపీవో, బెల్లంపల్లి మండలం

## సంక్షిప్త వార్తలు

**నోటిఫికేషన్ రద్దు**

తాండూర్: మండలంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ఖాళీగా ఉన్న స్వీపర్, స్కావెంజర్ పోస్టులకు గతంలో విడుదల చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేస్తున్నట్లు ఎంఈవో వాసాల ప్రభాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టర్, డీఈవో ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. త్వరలో మళ్లీ నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు తెలిపారు.

**పాఠశాల ప్రహరీ పనులు ప్రారంభం**

లక్సెట్టిపేట: మండలంలోని ఎల్లారం ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం ప్రహరీ పనులను అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. డీఎంఎఫ్‌టీ నిధులు రూ.12.20 లక్షలతో మంజూరైన అభివృద్ధి పనులను ప్రారంభించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పింగిళి రమేశ్, నాయకులు రమేశ్, పోచన్న, మహేందర్, శ్రీనివాస్ ఉన్నారు.

**విద్యార్థులకు టీసీ, బోనఫైడ్‌లు**

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ముల్కల్ల జెడీ ఉన్నత పాఠశాలలో టెన్త్ పూర్తి చేసిన విద్యార్థులకు శుక్రవారం టీసీలు, బోనఫైడ్, ఆన్‌లైన్ మార్కుల జాబితాలు అందజేశారు. పాఠశాలలో టాపర్‌గా నిలిచిన మాటేటి అర్చనను ఎంపీడీవో మధుసూదన్, హెచ్ఎం బొమ్మ గణపతిరెడ్డి, ఉపాధ్యాయులు రాజశేఖర్, రవీందర్ అభినందించారు.

**నేడు విద్యుత్ అంతరాయం**

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట సబ్‌స్టేషన్ నుంచి వచ్చే కొమ్మెర ఫీడర్ 33కేవీ లైన్ మరమ్మతు కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ భాస్కర్ తెలిపారు. ఆస్నాద, పొక్కూరు, దుగ్నెపల్లి, కొమ్మెర గ్రామాలకు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

**‘ఏరియాస్పత్రిలో అరకొర సదుపాయాలు’**

రామకృష్ణాపూర్:పట్టణంలోని సింగరేణి ఏరియా స్పత్రిలో అరకొర సదుపాయాల కారణంగా కార్మికులకు మెరుగైన వైద్యం అందడం లేదని ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు దేవిభూమయ్య ఒక ప్రకటనలో ఆరోపించారు. వైద్యసేవలపై అడిగితే ఆసుపత్రి ఏసీఎంఓ నుంచి నిర్లక్ష్యపు సమాధానాలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఏసీఎంఓ అసమర్థత వల్ల కార్మికులు, కార్మిక కుటుంబాలకు మెరుగైన వైద్యసేవలందడం లేదని ఈ విషయంలో ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలని కోరారు.

**వరద నీరు రాకుండా చర్యలు తీసుకోవాలి**

మంచిర్యాలటౌన్: పట్టణంలోని 17వ వార్డులోని బృందావన కాలనీ, సీతారామ కాలనీ, నాగదేవత కాలనీ, చున్నంబట్టి వాడలో వర్షపు నీరు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ పూదరి సునీత ప్రభాకర్ కోరారు. ఈ మేరకు మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్యకు శుక్రవారం వినతిపత్రం అందించారు. పోచమ్మ చెరువు మత్తడి కాలువ, ఫ్లై ఓవర్ బ్రిడ్జి వరకు పూడిక తీసి బృందావన కాలనీ, ఫ్లైఓవర్ పక్కన గల కల్వర్టు నిర్మాణం చేయాలని కోరారు.

**నేత్రదానం**

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఆర్కే 8 కాలనీకి చెందిన సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి పోతునూరి సత్యనారాయణ(80) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలను దానం చేశారు. గోదావరిఖనికి చెందిన సదాశయ ఫౌండేషన్‌కు సమాచారం ఇచ్చారు. వైద్యుడి సమక్షంలో నేత్రాలను స్వీకరించారు. నేత్రదానానికి ముందుకొచ్చిన కు మారులు శ్రీనివాస్, కోడలు స్నేహలత, తదితరులను సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి లింగమూర్తితోపాటు నూక రమేష్, శ్రవణ్, కుమార్, రామ్‌రెడ్డి అభినందించారు.

**మరమ్మతు పూర్తి చేయండి**

వేమనపల్లి: అమ్మ ఆదర్శ పాఠశాలలోని అభివృద్ధి పనులను ఈనెల 31లోగా పూర్తి చేయాలని ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని సూరారం, లక్ష్మీపూర్, జిల్లెడ, జక్కెపల్లి గ్రామాల్లోని పాఠశాలల్లో శుక్రవారం కొనసాగుతున్న పనులను పరిశీలించారు. ఆయన వెంట సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, కార్యదర్శి హరినాథ్ ఉన్నారు.

### ఇసుక ట్రాక్టర్లు అడ్డగింత

కోటపల్లి: మండలంలోని వెలమపల్లికి చెందిన మాజీ సర్పంచ్..రాపన్‌పల్లి సమీపంలోని ప్రాణహిత నది నుంచి గురువారం రాత్రి అక్రమంగా రెండు ట్రాక్టర్లతో తన ఇటుకల కంపెనీకి తరలిస్తుండగా గ్రామస్తులు అడ్డుకుని పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై కాంతారావు తెలిపారు.

### కోరం లేక సమావేశం వాయిదా

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. శుక్రవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఎంపీపీ శ్రీనివాస్‌తోపాటు మెజార్టీ సభ్యులు గైర్హాజరయ్యారు. కోరం లేక సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఎంపీడీవో మహేందర్ ప్రకటించారు. సమావేశాన్ని నిర్వహించే తేదీని త్వరలో ప్రకటిస్తామని ఎంపీడీవో తెలిపారు.